## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

**తాళ్లూరు:** మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో ప్రసిద్ధ గాంచిన పుణ్యక్షేత్రమైన గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం తొలి ఏకాదశి కావడంతో వేకువజామున నుంచే జిల్లానలుముల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు మెట్టిల బాలరాజు, పి.విజయలక్ష్మి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు కామేశ్వరశర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పుట్ట, నాగశిలలు, మల్లికార్జున స్వామికి పూజలు చేశారు. భక్తులకు అవసరమైన వసతులు ఏర్పాట్లను ఆలయ ఈఓ జి.వాసుబాబు, చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఏఆర్ కె.ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.

### ఎమ్మెల్యేను కలిసిన సుబ్బారెడ్డి



ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న సుబ్బారెడ్డి, నాయకులు

**పుల్లలచెరువు:** వైఎస్సార్ సీపీ పంచాయతీ వింగ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా నూతనంగా నియమితులైన పుల్లలచెరువు మండలానికి చెందిన బి.సుబ్బారెడ్డి ఆదివారం హైదరాబాద్ లో వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ను కలిసి శాలువతో సన్మానించారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, పార్లమెంట్ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలకు కృతజ్ఞతలను తెలిపారు. సుబ్బారెడ్డితో పాటు నాయుడుపాలెం సర్పంచ్ ఆవుల కోటిరెడ్డి, మల్లాపాలెం సర్పంచ్ రవణరెడ్డి, జిల్లా కార్యాచరణ కార్యదర్శి దోమకాలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని ఎమ్మెల్యేను సన్మానించారు.

### బసవయ్య సేవలు మరువలేనివి



బసవయ్య దంపతులను సత్కరిస్తున్న ఎంఈఓలు

**దర్శి:** ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయునిగా చీదెళ్ల బసవయ్య సేవలు మరువలేనివని వక్తలు పేర్కొన్నారు. బసవయ్య ఉద్యోగ విరమణ సన్మాన సభ ఆదివారం దర్శి వాసవీ కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. బసవయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. మాజీ టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్, ఎంఈఓ రఘురామయ్య, రమాదేవి, మాజీ ఎంపీపీ పూసల సంజీవయ్య, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సూరే సుబ్బారావు, గెజిటెడ్ హెడ్మాస్టర్లు ఓ. ఖాదర్ మస్తాన్,ఓ. ప్రకాష్ రావు పాల్గొన్నారు.

### అదుపు తప్పి లారీ బోల్తా



**తాళ్లూరు:** అదుపు తప్పి లారీ బోల్తా పడింది. ఈ సంఘటన ఆదివారం గుంటి గంగ దేవస్థానం సమీపంలో జరిగింది. స్థానికల వివరాల మేరకు..శివరామపురం వేళ్లే మట్టి రోడ్డు మార్గాన గ్రీన్ ఫీల్డ్ హైవేకి గ్రావెల్‌ను తరలిస్తుండగా లారీ ముందు టైర్ పగిలిపోవడంతో అదుపు తప్పిందని తెలిపారు. ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

# రేషన్ రాక.. తప్పని మోత

- రేషన్ బియ్యం కోసం వృద్ధుల కష్టాలు
- 2 కి.మీ బియ్యం బస్తాలు మోసుకురాలేక అవస్థలు
- వృద్ధులకు ఇంటిదగ్గరే రేషన్ హామీ గాలికి



దేవరాజుగట్టు గ్రామం నుంచి శివాపురం గ్రామానికి కాలినడకతో బియ్యం మూటతో మహిళలు

**పెద్దారవీడు:** ఇంటింటికీ రేషన్ పంపిణీకి మంగళం పాడి రేషన్ దుకాణాల వద్దే రేషన్ తీసుకోవాలన్న నిబంధన లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. సుదూర ప్రాంతాల్లో ఉన్న దుకాణాలకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాలంటే వృద్ధులు, వికలాంగులు నానా అవస్థలు పడుతున్నారు. వృద్ధులకు ఇళ్ల వద్దే రేషన్ ఇస్తామన్న కూటమి ప్రభుత్వం మాటలు నీటిమూటలుగానే మిగిలిపోయాయి. ఫలితంగా రేషన్ కోసం వృద్ధులకు అగచాట్లు తప్పడం లేదు. మండలంలోని దేవరాజుగట్టు పంచాయతీలోని దేవరాజుగట్టు గ్రామంలో చౌకదుకాణం నుంచి శివాపురం గ్రామానికి రేషన్ సరుకులు తీసుకొని తారురోడ్డు మార్గాన కాలి నడకతో వెళ్తున్న వృద్ధుల అవస్థలు వర్ణనాతీతం. దేవరాజుగట్టు రేషన్ షాపు నుంచి శివాపురం గ్రామానికి దాదాపు 2 కిలోమీటర్ల దూరం కాలినడకతో బియ్యం మూటను నెత్తిన పెట్టుకొని ఇంటికి పోతున్నామని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మొత్తం 135 రేషన్ కార్డులు ఉండగా అందులో దాదాపు 60 మంది వృద్ధులు ఉన్నారు. మార్గం మధ్యలో వర్షం కురిస్తే బియ్యం తడిసి ముద్దవుతున్నాయని వాపోతున్నారు. రేషన్ సరుకుల కోసం అష్ట కష్టాలు పడి నడిచి వస్తున్నా కూటమి ప్రభుత్వానికి మా గోడు పట్టడం లేదని వృద్ధులు ధ్వజమెత్తారు. గ్రామానికి చెందిన చదలవాడ రామలక్ష్మమ్మకు 4 నెలలు, దద్దనాల సీతారావమ్మకు 2 నెలలు, చీకటి లక్ష్మమ్మకు 2 నెలలు, ఏవి నారాయణరెడ్డి 4 నెలలు, కొంత మందికి రెండు, మూడు నెలల నుంచి బియ్యం ఇవ్వలేదని వృద్ధులు ఆరోపించారు. 2 కిలోమీటర్ల దూరం నుంచి బియ్యం తెచ్చుకోవడానికి అవస్థలు పడలేక డీలర్‌కు అమ్మి నగదును తెచ్చుకుంటున్నామని కొందరు వృద్ధులు తెలిపారు. జూన్ నెల 9వ తేదీ వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, మార్కాపురం సబ్ కలెక్టర్‌కు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. అయినా రెవెన్యూ అధికారులు ఇంత వరకు స్పందించకపోవడంపై వృద్ధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రేషన్ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకులు రావడంతో ఎలాంటి ఇబ్బందులు లేవని, ఆయనకు మంచి పేరు వస్తోందనే అక్కసుతో రేషన్ కార్డుదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, జిల్లా అధికారులు స్పందించి వాహనాల ద్వారా ఇంటి వద్దే రేషన్ సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**ఇంటి వద్దకే సరుకులు పంపిణీ చేయాలి**

వాహనాల ద్వారా ఇంటి వద్దనే రేషన్ సరుకులు పంపిణీ చేస్తేనే చాలా మంచిది. రేషన్ షాపు నుంచి 2 కిలోమీటర్ల దూరం కాలి నడకతో మోసుకెళ్లడానికి చాలా అవస్థలు పడుతున్నాం. డీలర్ బియ్యం ఇస్తామని వేలిముద్ర వేయించుకొని ఇంత వరకు ఇవ్వలేదు. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా వాహనాల ద్వారా మా గ్రామంలో ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలి.

– చదలవాడ రామలక్ష్మమ్మ, శివాపురం గ్రామం

# నగదు బదిలీ వద్దు.. ప్రజా పంపిణీ ముద్దు

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్య

**దొనకొండ:** నగదు బదిలీ పేరుతో ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసే ఆలోచన విరమించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కుందుర్తి అనిల్ అధ్యక్షతన ఆదివారం ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తే అది పేదల ఆకలి సమస్యను పెంచటమే కాక, రైతు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర ఉండదన్నారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీ 2 సీజన్లు కలిపి రాష్ట్రంలో 50 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించిందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ లేకపోతే అంత మొత్తంలో ధాన్యాన్ని సేకరించే అవకాశం ఉండదని, ఫలితంగా ధాన్యం ధర గిట్టుబాటు కాక రైతులు దెబ్బ తింటారన్నారు. అసలే వ్యవసాయ సంక్షోభంలో ఉన్న రైతాంగం ఆత్మహత్యలు మరింత పెరుగుతాయని గుర్తు చేశారు. బదిలీ పథకంతో చౌక ధరల దుకాణాలు తొలగిస్తే నిత్యావసర వస్తువులు బ్లాక్ మార్కెట్‌కు తరలించి ప్రజలు కొనలేని స్థితి ఏర్పడుతుందన్నారు. నగదుకు ఆహారం సరుకులే కొనుగోలు చేస్తారనే గ్యారంటీ లేదని, అవి దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని, ఫలితంగా పేద కుటుంబాలు ఆహార భద్రతకు లోనవుతారని గుర్తు చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థ లేకపోతే అందులో పనిచేసే వేలాది కార్మికులు, హమాలీల జీవితాలు అన్యాయం అవుతాయని ఆంజనేయులు తెలిపారు. సీఐటీయూ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ రేషన్ సరుకుల వాహనాలను రద్దు చేసినందున ప్రజలు తీవ్ర ఆవేదనలో ఉన్నారని, రేషన్ షాపులు కొన్ని గ్రామాలకు 2, 3 కిమీ దూరంలో ఉన్నాయని, అంత దూరం నుంచి రావటానికి పని మానుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. బియ్యం అక్రమ మార్గం పట్టకుండా ఉండాలంటే సన్న బియ్యాన్ని చౌక ధరల దుకాణం ద్వారా ప్రజలకు అందించాలని అంజయ్య కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమల్లోకి తేవాలని అంజయ్య కోరారు. సమావేశంలో ప్రజా సంఘ కార్యకర్తలు యం.అంజిబాబు, యం.సంతోష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో తిరునాళ్ల



పూజలు చేస్తున్న భక్తులు

**దొనకొండ:** మండలంలోని ఇండ్లచెరువు పంచాయతీ పరిధి పోచమక్కపల్లి రెవెన్యూలోని బెల్లస్థానం కొండపై తిరునాళ్ల ఆదివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఏటా తొలి ఏకాదశి సందర్భంగా చుట్టుపక్కల గ్రామాలైన ఇండ్లచెరువు, భూమనపల్లి, పిచ్చిగుంట్లపల్లి, నాగిరెడ్డిపల్లి, పరమటి పల్లి, గజ్జలకొండ, మాలపాటి పల్లి, కలివెలపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కొండపై వెలసిన శివపార్వతీ, ఆంజనేయస్వాములను పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. భక్తులకు పిచ్చిగుంట్లపల్లి గ్రామానికి చెందిన దాతలు అన్నదాన ఏర్పాటు చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

### కుక్కలకు టీకాలు



కుక్కలకు టీకాలు వేస్తున్న ఏడీ పురుషోత్తం రాజు

**దర్శి:** జోనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పశువైద్యశాలలో కుక్కలకు టీకాలు వేశారు. పశుసంవర్ధక శాఖ ఏడీ పురుషోత్తమరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని కుక్కలకు రేబిస్ వ్యాధి సోకకుండా టీకాలు వేశారు. ఈ సందర్భంగా పురుషోత్తమ రాజు మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలని సూచించారు.

# తొలి ఏకాదశికి కిక్కిరిసిన ఆలయాలు



బాలాత్రిపురసుందరీదేవి



త్రిపురాంతకం త్రిపురాంతకేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

**త్రిపురాంతకం:** ప్రముఖ శైవక్షేత్రం త్రిపురాంతకంలోని బాలాత్రిపురసుందరీదేవి, పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాలు తొలి ఏకాదశి సందర్భంగా భక్తుల ప్రత్యేక పూజలతో కిక్కిరిశాయి. ఆలయాల్లో స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు భక్తులచే నిర్వహించారు. స్వామి, అమ్మవార్లు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వచ్చారు.

### ఘనంగా మొహర్రం వేడుకలు



పీర్లను సుందరంగా ముస్తాబు చేసిన దృశ్యం

**తాళ్లూరు:** మండలంలోని మండలంలోని రామభద్రపురం, బొద్దికూరపాడు, సోమవరప్పాడు, గంగపాలెం గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొందరు ఉపవాసాలు ఉండి పీర్లను సుందరంగా ముస్తాబు చేసి ఊరేగింపు చేశారు. కుల మత విభేదాలు లేకుండా హిందూ ముస్లింలు కలిసి నిర్వహించడం మొహర్రం పండుగ విశిష్టత.



జగ్జీవన్‌రాంకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి, ఐటీ వింగ్ ఉద్యోగులు

# జగ్జీవన్‌రాంకు ఎమ్మెల్యే తాటిపర్తి నివాళులు

**యర్రగొండపాలెం:** స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, దేశ తొలి ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం హైదరాబాదులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు దొండేటి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఐటీ ఉద్యోగులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై సమరశంఖం

- లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు పోరాటం
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్

**దర్శి:** కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలపై దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా సమరశంఖం మోగిస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ అన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ఈ నెల 9న జరిగే సమ్మెలో శ్రామిక వర్గం అందరూ పాల్గొనాలని చేపట్టిన ప్రచారజీపు యాత్ర ఆదివారం దర్శికి చేరుకుంది. అనంతరం గడియార స్తంభం సెంటర్‌లో ఆదివారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 చట్టాలు శ్రామికులకు అండగా ఉన్నాయన్నారు. అంబాని, అదానీలకు దేశ సంపద దోచి పెట్టడం కోసం బీజేపీ ప్రభుత్వం 2020 లో పార్లమెంటులో చర్చలేకుండా మంద బలంతో బలవంతంగా పని గంటలు పెంచడం, యూనియన్ హక్కు లేకుండా చేయడం, వేతనాల చట్టం రద్దు చేయడం, లెబర్ డిపార్టుమెంట్ లేకుండా చేయడం వంటి దుర్మార్గపు పనులు చేసి శ్రామికులకు తీరని అన్యాయం చేశారన్నారు. పని భద్రత చర్యలు రద్దుతో కార్మికులు బానిసల వ్యవస్థకి మోడీ బాటలు వేస్తున్నారని విమర్శించారు. సీఐటీయూ దర్శి నాయకుడు తాండవ రంగారావు మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, టైం స్కేల్ , అప్కాస్‌లలో ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న కార్మిక, ఉద్యోగులను సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొనాలని కోరారు. ప్రచార సభలో సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ కాలేబాషా, ఉప్పు నారాయణ, కేవీ పిచ్చయ్య, గర్నిపూడి జాన్ సామ్యేల్ , గోగు వెంకయ్య, చిట్లా ఆదినారాయణ, మాలకొండయ్య, పి.రూబన్, నరేంద్ర , యలమందారెడ్డి , వెంకటేశ్వరరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు



ఏకలవ్యుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

**దర్శి:** మహర్షి ఏకలవ్యుడు జయంతి వేడుకలు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సంఘ సేవకుడు జీవీ రత్నం ఏకలవ్యుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువు లేకుండా విలువిద్య నేర్చుకున్న మహర్షి ఏకలవ్యుడు అమోఘమన్నారు. గురువుపై గౌరవంతో గురువు అడిగిన వెంటనే తన బొటనవేలును దానం చేసిన త్యాగజీవి మహర్షి ఏకలవ్యుడు అని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో బహుజనుల రచయితల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు అట్లూరి రామారావు, నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు డప్పు కళాకారులు పోరాట సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కవలకుంట్ల గోవింద ప్రసాద్ మాదిగ, దళిత సేన దర్శి నియోజకవర్గ అధ్యక్షుడు గర్నెపూడి ప్రేమ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జూపల్లి కోటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ ఇర్మియ, వెంకటేశ్వర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మెను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

**దర్శి:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.హనుమంతరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక గుజ్జుల సరళాదేవి భవన్ సీపీఐ కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ అప్రెంటిస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించి ప్రభుత్వ ప్రైవేట్ సంస్థలలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్పీఎస్, సీపీఎస్ పెన్షన్ విధానానికి బదులు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేసి కార్మికుల ఐక్యతను కేంద్ర ప్రభుత్వానికి తెలియచేయాలని కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్ కరుణానిధి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు సింగరకొండ శ్రీను, జూపల్లి కోటేశ్వరరావు, వి.శ్రీను, బిజ్జాల శ్రీను, శివయ్య, ఆరునూరి బాబు, ఇత్తడి ఇర్మియా, గొంగటి శ్రీకాంత్, కార్మికులు పాల్గొన్నారు.

# స్కీం వర్కర్లకి సంక్షేమ పథకాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న పిచ్చయ్య

**కురిచేడు:** స్కీం వర్లకు సంక్షేమ పథకాలు ఇవ్వాలని డైఫీ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య డిమాండ్ చేశారు. కురిచేడులో సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనంరూ.26 వేలు అమలు చేయాలన్నారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధరల చట్టం అమలు చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు ఎం రమేష్, రూబెన్, ఉప్పు నారాయణ, ఫణి కుమార్, అశోక్, బెంజిమెన్, సాల్మన్ పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో తొలిఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో కోనవల్లభరాయస్వామి



కురిచేడులో ప్రత్యేక అలంకరణలో కాళహస్తీశ్వరస్వామి



తాళ్లూరు: ప్రత్యేక అలంకరణలో మాధవరం నీలకంఠేశ్వర స్వామి



దొనకొండ: శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

**కురిచేడు:** తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా స్థానిక ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరి భక్తితో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, జ్ఞానప్రసూనాంబ దేవికి కుంకుమార్చనలు ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు చేశారు. కోనవల్లభరాయస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**దొనకొండ:** మండలంలోని అన్ని గ్రామాల్లో తొలి ఏకాదశి పర్వదినాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక ఆనంద ఆశ్రమం శివాలయంలో తొలి ఏకాదశి పండగను భక్తిశ్రద్ధలతో ఆదివారం జరుపుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంఛి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భైరవానంద స్వామి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు భైరవానంద స్వామి తెలిపారు.

**తాళ్లూరు:** తొలి ఏకాదశి పర్వదినాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. బొద్దికూరపాడులోని గంగా పార్వతీ వర్ధిని సోమేశ్వర స్వామి దేవాలయం, శ్రీదేవి భూదేవి సమేత మాధవ స్వామి దేవాలయం, గుంటీగంగా భవాని అమ్మవారి ఆలయం, శివాలయం, మాధవరం నీల కంఠేశ్వర స్వామి ఆలయం, అగస్తేశ్వర ఆలయంలో, కొత్తపాలెం పోలేరమ్మ, సాయిబాబా ఆలయం, తాళ్లూరు శివాలయం, వేణుగోపాల స్వామి ఆలయం , లక్కవరం క్రిష్ణ స్వామి ఆశ్రయంలతో పాటు పలు దేవాలయాలలో భక్తులు ఆధిక సంఖ్యలో సందర్శించారు.

ఆలయ పూజారులు ప్రత్యేక చేశారు. మండలంలోని లక్కవరంలో యముడు, యమునాదేవిగా గ్రామస్తులు పొంగళ్లు పెట్టుకున్నారు.